క్లుప్తంగా

నేటి నుంచి ఉరుసు

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎగువపేటలో చారిత్రాత్మకమైన ఆస్తాన-ఏ- ఫత్తుమియ్యా దర్గాలో మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోమవారం నుంచి ఉరుసు నిర్వహించనున్నట్టు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గంధంను ఆసారే షరీఫ్ ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా మసీద్ చేరుతుందన్నారు. అక్కడ గంధంను ఫతేహా నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. గంధం, ఉరుసు జరుగు రెండు రోజులు అన్నదాన కార్యక్రమం చేయనున్నట్టు పేర్కొన్నారు. ఉరుసును భక్తులు జయప్రదం చేయాలని ఆయన తెలియజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు యశ్వంత్‌కుమార్



రాజంపేట రూరల్ : రాష్ట్ర స్థాయి బాలబాలికల గట్కా ఛాంపియన్‌షిప్ - 2023లో పుల్లగంటి యశ్వంత్ కుమార్ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలియజేశారు. మండల పరిధిలోని యల్లాగడ్డలోని శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం యశ్వంత్ కుమార్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించి సత్కరించారు. అదే విధంగా వైఎస్సార్ కడప గట్కా అసోసియేషన్ సెక్రటరి ఆర్.రోహిణీ, విద్యార్థి తల్లిదండ్రులు పి.వేణుగోపాల్, అలేఖ్య హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ శంకర్‌రాజు, ఎండీ కె.భరత్‌కుమార్‌రాజు, ప్రిన్సిపల్ విజయ నిర్మల, పీఈటీలు సురేష్, వెంకటరమణనాయక్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు



సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పంచాయతీలోని ఒంటిళ్ల అరుంధతి వాడలో చిన్నపాటి వర్షానికే సిమెంట్ రోడ్డుపై నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై చిన్నారులు, వృద్ధులు నడవాలంటే ఎక్కడ కాలు జారి పడతామోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని నడుస్తున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.


వాకర్స్ డిస్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్‌గా శరత్‌కుమార్‌రాజు



శరత్‌కుమార్‌రాజును సన్మానిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

రాజంపేట : వాకర్స్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ 302 వైస్ ప్రెసిడెంట్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండూరు శరత్‌కుమార్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాదులోని ఆర్‌బీవీఆర్ రెడ్డి హాస్టల్ కాన్ఫరెన్స్ హాల్ అబిడ్స్‌లో నిర్వహించిన వాకర్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ సమావేశం జరిగిందన్నారు. సమావేశంలో మన రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన వాకర్స్ సభ్యులు హాజరయ్యారన్నారు. తనను ఎంపికకు సహకరించిన వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులకు కృతజ్ఞతలను తెలియజేశారు. కాగా అసోసియేషన్ ప్రతినిధులు మురళీ, మాధవరావు, రామానందం, కృష్ణకుమారి, నాగభూషణం, రాజంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాజు, ఆల్విన్ మాజీ కార్మిక నేత సుబ్బరాజులు శరత్‌ను ఘనంగా సన్మానించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆదివారం ఎస్‌జీఎఫ్ అండర్-19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్ పోటీలను ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ఆడనున్నట్లు ఆయన తెలియజేశారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయునీ బృందం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

- వసంతాలు చల్లుకుంటూ.. నృత్యాలు చేస్తూ..
- గణేశుడి నిమజ్జనంలో పాల్గొన్న చిన్నారులు, యువత, మహిళలు
- పలు చోట్ల లడ్డూ వేలాన్ని నిర్వహించిన ఉత్సవ కమిటీలు



లక్కిరెడ్డిపల్లె: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



పెనగలూరు మండలం సిద్దవరంలో..



ఓబులవారిపల్లె: వినాయకుడి గ్రామోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



రాజంపేట: అన్నదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాజంపేట రూరల్ మండలం కె.బోయినపల్లెలో..

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం గణనాథుల నిమజ్జన వేడుక కోలాహలంగా సాగింది. ఏడవ రోజు కావడంతో అనేక మంది వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు దారిపొడవునా బ్యాండు వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ, ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని కేరింతలు కొడుతూ ముందుకు సాగారు. పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. అన్ని ప్రాంతాల్లో గణపయ్య భక్తుల సందడి కనిపించింది.

రూ.88 వేలు పలికిన లడ్డూ

రాజంపేట పట్టణం ఎర్రబల్లి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం వినాయకుడి లడ్డూను వేలం వేశారు. పట్టణానికి చెందిన లక్ష్మాపురం వెంకటసుబ్బయ్య, స్రవంతి దంపతులు రూ.88 వేలకు స్వామివారి లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

వినాయకునికి ఘనంగా వీడ్కోలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ఆదివారం గణేశుడి నిమజ్జనాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. గణేష్ మహరాజ్‌కు జై అంటూ వినాయకుడికి వీడ్కోలు పలికారు. వాహనంలో ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవాన్ని జరిపారు. వసంతాలు చల్లుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. రామాలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు, గ్రామస్తులకు పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా పూజలు

సిద్దవటం : మండల కేంద్రంలోని గాంధీవీధిలో ఆదివారం వినాయకుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అలానే మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో, సిద్దవటంలోని గాండ్లపాలెంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహాలకు ఆదివారం నిమజ్జనం కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాధవరం-1 గ్రామంలో లక్కి డ్రిప్‌లో పుత్తా వెంకటసుబ్బారావుకు స్వామి వారి లడ్డూ గెలుపొందారు. గాండ్లపాలెంలోని వినాయక స్వామి లడ్డూను వేలం పాట వేయగా సిద్దవటంకు చెందిన ఎద్దుల గుండ్ల సుబ్బయ్య రూ. 31,000 వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

ఘనంగా నిమజ్జనాలు

చిన్నమండెం : రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వినాయక ప్రతిమలను మండల పరిధిలోని శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది సైతం నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లెలో జరిగిన వినాయక చవితి ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేసి, లడ్డూ వేలం, ఉట్టికొట్టే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోలిశెట్టి సుబ్బరాయుడు రూ. 14,500లకు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో కీర్తికి బహుమతిని అందించారు.

పెనగలూరు మండలంలో..

పెనగలూరు : మండలంలో మిగిలి ఉన్న వినాయక విగ్రహాలకు ఆదివారం వైభవంగా నిమజ్జనాలు నిర్వహించారు. ఏడు వినాయక ప్రతిమలను గుంజన నది వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని జరిపారు. తొమ్మిది రోజులపాటు గ్రామాలలో పూజలందుకున్న గణనాథులు మధ్యాహ్నం నిమజ్జనానికి తరలించారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : భక్తుల కోలాహలం నడుమ, బ్యాండ్ మేళాలు, బాణాసంచా పేలుస్తూ ఆదివారం మండలంలోని పాతకోర్టు, గుడ్లవారిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఏరియాతోపాటు మిగిలిన గ్రామాలలో వినాయక ప్రతిమలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డిలు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉండ్రాలయ్య.. ఉంటామయ్యా

రాజంపేట రూరల్ : నియోజకవర్గంలో నిమజ్జన వేడుకలు ఆదివారం ఘనంగా కొనసాగాయి. వేడుకలలో భాగంగా స్వామి వారికి అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ప్రతిమలను మండపాల నుంచి ప్రత్యేక వాహనం పైకి చేర్చి గ్రామోత్సవం జరిపారు.

కె.బోయినపల్లెలో..

మండల పరిధిలోని కె.బోయినపల్లిలో శ్రీ భావన రుషి భద్రావతి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన శ్రీవినాయకస్వామి 16 వార్షికోత్సవంలో ఆదివారం కమిటీ నిర్వాహకులు లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ముఖ్య అతిథిగా రూరల్ ఎస్ఐ ఎం.భక్తవత్సలం పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడా చిన్న ఓబులేసు కుమారులు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

చక్రదరులకాలనీలో..

మండల పరిధిలోని చక్రదరుల కాలనీలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద కమిటీ నిర్వాహకులు లడ్డూ వేలంపాట నిర్వహించారు. వేలంలో పట్నం మహేష్ రూ.14 వేలకు లడ్డూను దక్కించున్నారు.

భక్తులకు అన్నదానం

నందలూరు (రాజంపేట): సౌమ్యనాథస్వామి ఆలయ చైర్మన్ అరిగెల సౌమిత్రి చంద్రనాథ్ కుమార్తె అరిగెల శ్వేత పుట్టినరోజు సందర్భంగా సౌమ్యనాథస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ త్రినాథ్, అజీజ్ అహ్మద్, ఉపసర్పంచ్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమండెం: శ్రీనివాస రిజర్వాయర్ వద్ద నిమజ్జన బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



రాజంపేట టౌన్: వేలంలో దక్కించుకున్న లడ్డూతో వెంకటసుబ్బయ్య



సిద్దవటం: గాంధీ వీధిలో ఏర్పాటు చేసిన ఏకదంతుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న స్థానిక భక్తులు



రామాపురం: యర్రమరెడ్డిగారిపల్లెలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు పాటూరు విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నందలూరు (రాజంపేట) : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నందలూరు మండలం పాటూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మహానందిలో జరగబోయే పోటీలకు పాఠశాలకు చెందిన అమృత, రూప, సంధ్యలు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సుస్మిత, పీఈటీ జగన్‌లు తెలిపారు. సెప్టెంబర్ 24వ తేదీ ఆదివారం ఖాజీపేట మండలం బీరం సుబ్బారెడ్డి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో కడప జిల్లా స్థాయి ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలలో సబ్ జూనియర్స్ విభాగంలో విద్యార్థినులు అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారని వీరు తెలిపారు. విద్యార్థుల ఎంపికపై ప్రధానోపాధ్యాయురాలు జి.మాధవీలత విద్యార్థులను, పీడీ, పీఈటీలను అభినందించారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో బోర్లు ఏర్పాటు



పార్వతీపురంలో బోరు వేస్తున్న దృశ్యం

సిద్దవటం : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సొంత నిధులతో రెండు బోర్లను ఏర్పాటు చేసినట్లు మాధవరం-1 గ్రామ సర్పంచ్ అవ్వారు జానకిరామయ్య, మాజీ సర్పంచ్ మేకపాటి సుబ్బారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాధవరం-1 గ్రామ పంచాయతీలోని పార్వతీపురం గ్రామంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పర్యటించగా గ్రామస్తులు నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో స్పందించిన ఆయన ఆదివారం పార్వతీపురంలోని నాగులమాను వీధిలో ఒకబోరు, గ్రామంలోని శీతల గంగమ్మ గుడి ముందర ఒక బోరును వేయించి నీటి సమస్యను పరిష్కరించినట్లు వారు తెలిపారు.

యువతకు ఆదర్శం కొరటాల సత్యనారాయణ



కొరటాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

రాయచోటి అర్బన్ : నేటి యువత సీపీఎం నేత కొరటాల సత్యనారాయణను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రామాంజులు అన్నారు. కొరటాల సత్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం సీపీఎం నేతలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికి పేదల పక్షాన పోరాడుతూ అంచలంచెలుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎదిగారన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేశాడన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగబసిరెడ్డి, మాధవయ్య, రెడ్డిశేఖర్‌లతోపాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొరటాల పోరాటాలు వెలకట్టలేనివి

రాజంపేట రూరల్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కొరటాల సత్యనారాయణ చేసిన పోరాటాలు వెలకట్టలేనివని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ అభిప్రాయపడ్డారు. స్థానిక ఆర్అండ్‌బీలో ఆదివారం కొరటాల 18వ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సర్వేపల్లి నరసింహా, బి.శివయ్య, వెంకటేష్, ప్రభాకర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి



గోడ పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఈ నెల 29న విజయవాడలో చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయరామయ్య, పి.మణీ, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఎస్.పెంచలయ్యలు కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ వద్ద ఈ మేరకు గోడపత్రాలను ఆదివారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహాలు గోడ పత్రాలు ఆవిష్కరించారు. బి.శివయ్య, సీఐటీయూ కేవీ రమణ, రైతు సంఘం నేత సి.హరిప్రసాద్, కె.చెన్నకేశవులు పాల్గొన్నారు.

అక్టోబర్ 3లోపు ఫీజు చెల్లించాలి

పీలేరు : ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, అంతకుమునుపు జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు అక్టోబర్ 3వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించడం తోపాటు తరగతులకు కూడా హాజరు కావచ్చునని తెలిపారు.

ఎండీవీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు : ఎండీవీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో ఖాళీగా ఉన్న మూడు ఎండీవీలకు కులాలకు అతీతంగా మండలస్థాయిలో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు. సిద్దవరం, నల్లపరెడ్డిపల్లి, చక్రంపేట పరిధిలోని ఓబిలి, సిద్దవరం, సింగనమల, నారాయణ నెల్లూరు, నల్లపరెడ్డిపల్లి, పొందలూరు, చక్రంపేట, కాకర్లవారిపల్లి, పేరంవారిపల్లి, ముద్రపల్లి డీలర్ల పరిధిలో బియ్యం పంపిణీ చేయాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు లైసెన్సు, ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో గానీ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల్లో గానీ ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9154511133 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బుడుగుంటపల్లి హరిజనవాడకు చెందిన ప్రణీత్ కుమార్‌కు ఆదివారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే చిన్నపాటి ఇల్లు కూడా నిర్మించి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణీత్ కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడటంతో అతడికి ఫౌండేషన్ ద్వారా సహాయం చేశామన్నారు. కార్యక్రమంలో ముక్కవారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, బీదం ప్రవీణ్ కుమార్, రమణరాజు, శివకుమార్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : పట్టణానికి చెందిన పేద కుటుంబానికి ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనార్టీస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. పట్టణంలోని అలీమాబాద్ వీధికి చెందిన ఖాదర్‌బాషా కుటుంబం పేదరికంతో ఇబ్బందులు పడుతుండేది. కుటుంబీకులు ఆజాద్ సొసైటీ సభ్యులను ఆర్థిక సాయం కోరగా సభ్యులు ఖాదర్‌బాషా కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు షాహుల్ హమీద్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌అలీ, సభ్యులు మహమ్మద్ ఇలియాస్, ముహిబుల్లా, సిబాతుర్ రహిమాన్, హబీబుర్ రహిమాన్ పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని కోటగడ్డపై వెలసిన అభయాంజనేయస్వామికి ఆదివారం ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే ఆంజనేయస్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కార్మిక నాయకుడు సత్యనారాయణ

రాయచోటి అర్బన్ : పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలన్నారు. 2007 దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో సంక్షేమ బోర్డు ఏర్పాటైందని, ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 22లక్షల మంది కార్మికులు తమ పేర్లు నమోదు చేయించుకుని ఫలాలు పొందేవారన్నారు. గత కొన్నేళ్లుగా 32 వేలకు పైగా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి వెంటనే నిధులు విడుదల చేయాలంటూ డిమాండ్ చేవారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చుచేయాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో లాగా కార్మిక సంక్షేమ బోర్డు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ. 5 వేల పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కార్మికుల కుమార్తెల వివాహాలకు వివాహకానుకల తరహాలో విద్యార్హతతో సంబంధం లేకుండా రూ.40వేలు మంజూరు చేయాల ంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలు బైరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, మద్దిలేటి, శ్రీరాములు, జిల్లా నేతలు గాలిచంద్ర, సలీంబాషా, నరసింహులు, గపూర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ నేతలు రాధాక్రిష్ణ, సాంబశివ, శ్రీనివాసులు, పుల్లయ్యతో పాటు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా గాలి చంద్ర ఎన్నిక

రాజంపేట రూరల్ : భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్టు గాలి చంద్ర తెలియజేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆదివారం ఆ సంఘం జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో తాను గతంలో కార్మికుల కోసం చేసిన పోరాటాలను గుర్తించి ఈ పదవిని అందజేశారన్నారు. జిల్లాస్థాయిలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తానని తెలియజేశారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్

రామాపురం : మండల కేంద్రాలు, మున్సిపాలిటీ ఏరియాల పరిధిలోని విద్యార్థులు గ్రంథాలయాలను విరివిగా ఉపయోగించుకోవాలని కడప జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వార్షిక తనిఖీ చేశారు. సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో పలు విషయాలు చర్చించారు. ప్రతి రోజు గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరగడమే కాకుండా మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. గ్రంథాలయానికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల శాఖ గ్రంథాలయాధికారి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి



సంబేపల్లె: భక్తులతో కిటకిటలాడుతున్న నల్లగంగమ్మ ఆలయం



లక్కిరెడ్డిపల్లె: అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే అమ్మవారికి పూజలు ప్రారంభమయ్యాయి. దేవరరాయిని భక్తులు పూజించి తల్లి కటాక్షాల కోసం ప్రణమిల్లారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసింది. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మ తల్లి అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అమ్మవారికి అభిషేకంతో పాటు కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్‌కు నేడే ఆఖరు

పెద్దతిప్పసముద్రం: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షా దరఖాస్తుకు చివరి రోజు సోమవారం అని ఎంఈఓ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక స్తోమత లేనందున ఉన్నత విద్యకు దూరమవుతున్నారని భావించిన ప్రభుత్వం 2008లో ఈ ఎన్ఎంఎంఎస్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటికే ఈ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతియేటా ప్రోత్సాహక నగదును జమ చేస్తోందన్నారు.